
కథ

# ఆకాశం చిల్లుపడింది

వేదుల శకుంతల



తెల్లవారుఝామున, నిద్రమత్తు ఇంకా వదల్లేదు... రాత్రంతా పడుకున్నా... అదేమిటో... తెల్లవారగట్ల పట్టిన నిద్ర... జోగొట్టున్నట్టే వుంటుంది! చల్లటిగాలి కూడా చెవులకీ, చెంపలకీ, తాకి బొజ్జో పెట్టుంది! చేయాల్సిన పనులు బోలెడున్నాయి. కాఫీ – టిఫెను, వంట, పిల్లలిద్దర్నీ తయారుచేసి స్కూలుకు పంపాలి. శ్రీవారి ఆఫీసు టైంకి అన్నీ సిద్ధం చెయ్యాలి... మధ్యలో పనిమనిషీ, పాలవాడూ, చెత్త తీసుకెళ్లే అబ్బాయి అరుపూ... అబ్బో ప్రపంచయుద్ధం అంటే అదేనా? నవ్వుకున్నాను. అరగంట దాటిందంటే చాలు, పాలవ్యాన్ చప్పుడు, దూరం నుంచి వినిపించే... 'నమాజ్' మేలుకొలుపు 'అల్లాహో అక్బర్' – అనీ, అంతలోనే అందుకు జోడీగ... వేంకటేశుని సుప్రభాతం గుడిలోంచీ, వీధి గుమ్మాని కేసి 'ఠాప్'మని కొట్టి 'పేపర్' అనే విసురూ.... ఇరుగింటి, కుక్కర్ విజిల్, పొరుగువారి కిచెన్నుంచి గ్రైండర్ రొదా... ఎదురింటి కాంపౌండ్‌లో 'డుర్'... 'డుర్'... 'డుర్' అంటూ స్కూటర్ స్టార్టింగ్ ట్రబుల్.... శ్రవణానందం.... ఇవన్నీ... నిత్యజీవిత సత్యరూపాలు! వీటి ముందు ప్రపంచ యుద్ధాలు గొప్పేం కాదు! ఒక్క అరగంట ఆగితే చాలు. అన్నీ మొదలవుతాయి!! ఈ ఒక్క అరగంట చిన్న కునుకు తీయాలి!! కానీ ఐదు నిముషాలు కాకుండానే... ఉలిక్కిపడ్డాను!

''వద్దు ... వద్దు.... ఇంక నేను భరించలేను. పో! పో! నీ కిష్టమైన చోటికి పో!'' పెద్దపెద్ద అరుపులు... ఆ నిశబ్దప్రభాతంలో... కఠోరంగా వినిపించాయి! ఇంకా రకరకాల పదాలు రాళ్ళల్లాంటివి, శబ్దాలతో రాలుతూనే వున్నాయి! నిద్ర ఎగిరిపోయింది!! శ్రీకారం చుట్టుకున్న అరచేయిని కళ్ళకి అద్దుకుని చట్టుక్కున లేచాను.

'ఎవరూ? ఎవర్ని ఛీత్కరిస్తున్నారు? ఇంత పొద్దున్నే ఏమి జరిగింది?' లేచి బాల్కనీలోకి వచ్చాను. మా అపార్ట్‌మెంటులో, ఇంకా ఎవరు లేచినట్టు లేరు... పక్కనున్న ఇండిపెండెంటు ఇంట్లో ఉన్న 'మనోహర్' గొంతు అది! తల్లిని కసురుకుంటున్నాడు. ఆ ఇంట్లో అద్దెకున్న వాళ్ళు లేచి ఏదో చెప్ప బోతున్నారు. కాని అతను వినిపించుకోవటం లేదు! రెండు మూడు వాటాలు అద్దెకిచ్చి ఒక వాటా తమకోసం కేటాయించుకున్నాడు. భార్యా ఇద్దరు చిన్నపిల్లలు, తల్లితో వుంటున్నాడు. ఏదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టు విన్నాను. రెండేళ్ళక్రితం వాళ్ళనాన్న బ్రతికి వున్నాడు. అప్పుడు ఈ మనోహర్ భార్యాపిల్లలతో, వేరే ఊళ్లో ఉద్యోగం చేసేవాడు. అప్పుడప్పుడు వస్తూండే వాళ్ళు.

సరిగ్గా మా హాల్లో కిటికీ దగ్గర నిల్చుంటే వాళ్ళ బాల్కనీ... అదే టెర్రస్ పూర్తిగా కనిపించేది! అప్పుడు అద్దెకివ్వడానికి అన్ని వాటాలూ లేవు!


కింద ఒక పెద్ద భాగం అద్దెకిచ్చి.. పైభాగం అంతా వాళ్ళు వుండే వారు!

అతను వచ్చినప్పుడల్లా... భార్యవైపు బంధువు ఒకళ్ళో ఇద్దరో వచ్చి - మనోహర్ తల్లితో, తండ్రితో.... ఏదో గొడవ పడ్తుండే వాళ్ళు!

ఏమైవుంటుందో అర్థమైపోతూనే వుండేది! ప్రతీ ఇంట్లో సాధారణంగా జరిగే గొడవలే! అయినా ఒక్కకొడుకు - ఒక కూతురు అని తెలుసు. కూతురు అల్లుడు, ఎక్కడో నార్త్‌లో వున్నారుట! మరి ఈ కొడుకు, కోడలుతో ఏమి విబేధాలు న్నాయో తెలియదు కానీ... సఖ్యతగా వుండే వారు మాత్రం కాదని, తెలుస్తూనే వుండేది! విషయం తెలుసుకోవాల్సి నంత అవసరం కాని, ఇంట్రెస్టు కానీ, నాకు లేదు! పొరుగు వారు కనుక - కిటికీలో నుంచి కనిపించే దృశ్యం గనుక, అనాసక్తిగానే చూసేదాన్ని!!

కానీ, ఆ తండ్రి, కొడుకు ఎంతో ఆప్యాయంగా వుండేవారు! ఆ కొడుకు వున్న నాల్గు రోజులు - మోటారు సైకిల్ మీద బయటికి వెళ్తూ ఏవేవో సరకులు తెస్తూ... సరదాగా కనిపించేవారు. మనమల్ని ఎంతో ముద్దు చేసేవాడు, ఆ పెద్దాయన! ఇదంతా - మా ఫ్లాటుకి పక్కనే వున్నందు వల్ల దృష్టిలో పడేది! ఈ సమాజంలో... ఎంతో మందిని చూస్తుంటాం!

ఎన్నో వింటూంటాం! అన్నింటినీ పట్టించుకోలేము గదా? అలాగే.... మా పక్కింటి సంగతి కూడా!! అయితే! కేలండర్లో కాగితాలు మారినట్టు - పరిస్థితులు. పరిసరాలు, చుట్టుపక్కలు, కూడా మారిపోతుంటాయి మరి!! మా స్ట్రీటులో ఎన్నో అపార్టుమెంట్లు వెలిసేయి! ప్రతి చోట మేడలు - షాపులు - రూపుదిద్దుకున్నాయి!



మా పక్కన టెర్రస్‌మీదా, రెండంతస్తులు లేచేయి! తండ్రీ కొడుకులు ఎంత ప్లాన్ వేసేరో గానీ...? బ్రహ్మాండంగా రెండు ఫ్లోర్లు అందమైన డిజైన్‌తో... పాత ఇంటిని రూపుమాపి కొత్తకళని తెచ్చిపెట్టుకున్నారు! ఆ తండ్రి, ఎంత కష్టపడేవాడో?? ఇరవై నాల్గు గంటలు కనిపిస్తూనే వుండేది, నాకు!

ఆ తల్లి కూడ కూలీలతో సమంగా శ్రమించి వాళ్ళకి పచ్చళ్ళు.... కూరలు, నీళ్ళు...అందించేది! అదంతా చూస్తున్నప్పుడు... 'స్వంత ఇంటి తాపత్రయం ఇలాగ వుంటుందన్నమాట!' అని నవ్వుకునే దాన్ని! ఎందు కంటే మాది స్వంత ఫ్లాటే

అయినా మేము దగ్గర వుండి కట్టించుకోలేదు గదా?! తర్వాత హంగులన్నీ ఏర్పాటు చేసుకోవడం వేరు! అందుకని ఆ అందమైన రెండు ఫ్లోర్లున్న మేడ తయారీకి ఆ తల్లిదండ్రుల కష్టం-- సిమెంటు, ఇసుక కలిసినంతగా నిక్షిప్తమైవుందని చాలాసార్లు అనుకున్నాను! ఓ దసరా రోజు... నూతన గృహ ప్రవేశం చేసుకున్నారు.

కానీ... కానీ... వాళ్ళ ఆనందంలో ఒక మసి గీసిన చారిక... లోతుగా దిగబడింది! అదే... అదే... ఆర్నెల్ల తరువాత ఆ పెద్దమనిషి... చాలా హఠాత్తుగా రెండు రోజులు సుస్తీ చేసి... పోయాడట!!

నేను అప్పుడు ఊరికెళ్ళాను. తిరిగి వచ్చేసరికి ఆ వార్త తెలిసింది! అరెరే!! అనుకున్నాను. అయ్యో ఆవిడ్ని ఒకసారి చూడాలనుకున్నాను. ఆవిడతో నాకు పరిచయం లేదు. ఎప్పుడు మాట్లాడలేదు. అయినా ఏదో బాధ అనిపించింది? ఈ మానవతా భాంధవ్యాన్ని ఏమనాలో తెలియదు.

కానీ... ఆవిడ నెలదాకా కనిపించలేదు! తమ్ముడు తీసుకెళ్ళాడని ఎవరో చెప్పారు.

ఆ తర్వాత కొడుకు బదిలీ చేయించుకుని ఫ్యామిలీతో వచ్చేసేడు! తల్లిని తీసుకు వచ్చాడు - 'హమ్మయ్య' అనుకున్నాను. 'ఎందుకూ' ఏమో? అదో తృప్తి! పైగా ఆ మనోహర్ ఇంట్లో రెండు మూడు వాటాలు అద్దెకిచ్చాడు! ఇల్లు పెద్దదైంది కదా?

ఇప్పుడు ఇల్లంతా సందడి! ఆ తల్లి క్రమక్రమంగా కోలుకున్నట్టు కనిపించేది - ఫైన వాటర్ సంపు చూసేది... బట్టలు ఆరవేసేది, బాల్కనీలో నిల్చుని అన్నీ చూస్తూ వుండేది. మనమలతో కోడళ్ళతో కబుర్లు చెప్తూండేది.

అప్పుడప్పుడు... కోడలివైపు బంధువులు వస్తుండే వారు - మనోహర్‌కి ఏవో సూచనలు చెప్పి - అక్కడ గ్రిల్ పెట్టించమనీ, ఈ కిటికీ మార్చమనీ కొన్ని చేయిస్తూ కనిపించే వారు... ఆ ఇంటికి కొత్త కొత్త సింగారాలు, కనిపించినప్పుడల్లా... 'ఓహో!' అనుకునేదాన్ని!...

చుట్టుపక్కల ఎన్నో కడ్తున్నారు... అన్నీ కన్పిస్తూనే వున్నాయి! కాకపోతే... ఆ బిల్డింగ్‌లన్నీ దూరం, దూరం కనుక .... అక్కడ జరిగే పనులు విషయాలు తెలియాల్సినంత అవకాశం లేదు... అవసరమూ లేదు...


మనోహర్ వాళ్ళది పక్క మేడే కనుక - పనులు చేసుకునేప్పుడు, కనిపించే వీలుంది గనక.... విషయాలు తెలిసే సమయం వస్తుంటుంది గనుక, చాలావరకు గ్రహించగల్గేను. అయినా ఇదంతా నాకెందుకు? నాకుండే, పనులు వ్యాపకాలు బోలెడు... అని ఒక్కోసారి నామీద నాకే చిరాకేస్తుంది!

కానీ.... కానీ... ఈరోజు... ఈ వేకువఝామున, పదిమంది, ఇంకా నిద్ర లేవని నిశ్శబ్ద సమయంలో మనోహర్ - పదునైన పరుష వాక్యాలతో - కేకలేస్తూ బయటికి పొమ్మంటున్నాడు... అద్దెలవాళ్ళు అడ్డుకుంటు ఆపుతున్నా ఆగటం లేదు. వాళ్ళ గేటు ముందు సరిగ్గా లైటు స్థంభం వుంది. ఆ వెలుగులో అంతా కనిపిస్తూనే వుంది. వాడు తల్లి చేయి పట్టుకుని, గేటుతీసి బయటికి గెంటుతున్నాడు! అద్దెకున్న ఒకాయన, మనోహర్ చేయి పట్టుకుని ఆపి - ఆమెను గేటు లోపలికి తీసుకు వచ్చాడు!...

'ఏమిటి చూసేను? నేను నిలబడే వున్నాను. కళ్ళు తిరిగి పడిపోలేదా? నిద్రలో కలకంటున్నానా?'

''ఏమిటి పావుగంట క్రితం లేచి వచ్చి ఇక్కడ నిలబడ్డావు? కొంచం సేపు పడుకో పోయి!'' శ్రీవారి పల్కరింపుతో తెప్పరిల్లుకున్నాను-

''పడుకోవాలనే అనుకున్నాను. అరుపులకి మెలుకువ వచ్చి లేచేను - ఏమిటండీ ఈ దారుణం? పాపం! ఆ తల్లిని అలా బయటికి గెంటుతున్నాడు - వీడికేం రోగమండి?'' నాకు ఏడ్పు వస్తోంది.



''ఇలాంటి దారుణాలు ఎన్నోచోట్ల ఎన్నెన్నో జరుగుతున్నాయి! కాకపోతే - ఇవాళ ఇది నువ్వు చూసేవుగనక - చలించిపోతున్నావు! సరేలే పాల వ్యాన్ వచ్చే వేళవుతోంది... నువ్వు పనులు మొదలు పెట్టే నయం! లేక పోతే... మళ్ళీ పరుగుపందెం మొదలు పెట్టాలి. రా లోపలికి'' అంటూ తను లోపలికి వెళ్ళారు. మనోహర్ వాళ్ళూ కూడా గేటు మూసి అంతా లోపలికి వెళ్ళేరు-

మనసును అదుపులోకి తెచ్చుకుని - మనిషిగా కదిలి ఇంట్లోకి వచ్చాను!

'అలవాటుచొప్పున కార్యక్రమాలన్ని చేస్తున్నాను అంతే! బుర్రలో దొలిచేస్తున్న రొద... ఉద్రేకంగా, మారి ఏం చేస్తానో? ఏ వస్తువు పారేస్తానో తెలియదు!' పిల్లల్ని స్కూలుకి పంపటం.... శ్రీవారిని ఆఫీసుకు పంపటం మిగతా పనులు, మరమిషన్‌లా... స్విచ్ నొక్కితే వెలిగే విద్యుత్ శక్తిలా, టైము చూసుకుంటు చేసేసేను. అన్నీ అయ్యాక అప్పుడు.. అప్పుడూ... మొదలైంది ఆలోచన!

'అసలు ఏం జరిగింది? మా అపార్ట్‌మెంటులో వాళ్ళు కూడా చూసేరా? చూసి వుండరు? ఆ టైమ్‌లో ఎవరు లేచే వుండరు!! కొంత నయమే. ఆ తల్లి పరాభవం గేటు దాటి బయట పడలేదు! కానీ పడుతుంది... ఆ మేడలో వాళ్ళు మరో పదిమందికి చెప్పకుండా వుంటారా?'

ఏమైనా... కొడుకు గెంటుతున్నప్పుడు ఆ దీనావస్థలో ఆమె తల విదిలిస్తూ... కళ్ళ నీళ్ళు కారుస్తున్న.... పరిస్థితి... ఎవ్వరికీ రాకూడదు!!

ఆ తర్వాత... ఆమె, ఆ బాల్కనీలో కానీ, టెర్రస్సు మీద కానీ, నాకు కనిపించలేదు. మా అపార్టుమెంటు వాళ్ళదగ్గర ఈ ప్రస్తావన వచ్చినప్పుడు ''ఏమోనండి! వాళ్ళకీ, వాళ్ళకీ ఏం గొడవలున్నాయో? రెండు చేతులు కలిస్తేనే కదా చప్పుడు అయ్యేదీ? ఈవిడేమి అందో? ... ఆ కోడలు ఏమి చెప్పిందో - ఆ కొడుకుకి కోపం వచ్చి వుంటుంది! ఈ రోజుల్లో భార్యాభర్తల మధ్యే గొడవలొచ్చి డైవర్స్ ఇచ్చుకుంటున్నారు...ఇక ఆస్తులకోసం... అన్నదమ్ములు, తండ్రీ కొడుకులు కొట్టు కుంటున్నారు... తల్లీకొడుకుల మధ్యే అంతే అయి వుంటుంది! ఇవన్నీ మామూలే! ఇదేమన్నా పురాణ యుగమా? కలియుగం!! సునామీలు, భూకంపాలు రావటం లేదూ? అలాగే ఇళ్ళల్లో గలాటాలు... గందర గోళాలు... తప్పవులెండి... అయ్యో మీతో మాట్లాడుతూంటే టైమే చూసుకోలేదు.... రెండవుతోంది మేము షాపింగ్ కెళ్ళే పని వుంది. వస్తాం'' అంటూ ఇద్దరమ్మలు హడావిడిగా వెళ్ళిపోయేరు. మరొకావిడ టీ.వీలో సీరియల్ వస్తోందని గబగబా పరిగెట్టింది. మిగతా వాళ్లు.... వీధుల్లో కూరగాయల బండి వచ్చింది. చూడాలని బుట్టలు తెచ్చుకునేందుకు వెళ్ళేరు..

తెల్లముఖంతో.... నిలబడిపోయేను!!! ఇదీ

సమాజం?

ఇంతదారుణం ఎవరికీ పట్టలేదా? పట్టించుకోరా? మామూలేనా? విద్యా వంతులైన ఆడవాళ్ళు కూడా - సగటు అమ్మలక్కల స్థాయిలో చెప్తున్నారేమిటి? 'నా పిచ్చితనం' వాళ్ళకి... గడ్డిపరికలా తోచింది కాబోలు! తోసి పడేసి... వాళ్ళ అమూల్యమైన కాలాన్ని వృధా చేయకుండా, చేసుకో కుండా వెళ్ళిపోయారు. కాలం ఎవరికోసం ఆగదు కదా?

రోజులు, వారాలై.... నెలలై... సంవత్సరంలోకి జారేయి! మనోహర్ సంగతీ వాళ్ళ ఇంటి సంగతీ నేను మరచిపోయేను. వాళ్ళమ్మ మాత్రం ఎక్కడో క్షేమంగానే వుందని విన్నాను....

అలా ఎక్కడివాళ్ళు అక్కడ క్షేమంగా, కులాసాగా వుంటే... సమస్యలెలా వస్తాయి? కానీ విధి చాలా తమాషా చేస్తుంది.

మనోహర్ ఒకరోజు మెట్లు దిగుతు - కాలు స్లిప్పై మెట్టుజారి కింద పడ్డాడు! రేలింగ్ పట్టుకుని పడటంలో చేయిబెణికింది. భార్య, ఆసుపత్రిలో చేర్పించి అన్నగార్కి తెలియబరిచింది! అద్దెకున్న వాళ్ళంతా చేయగల్గినంత సహాయం చేసేరు... ఆఫీసు వాళ్ళు వచ్చి చూసి వెళ్ళేరు. ఆసుపత్రిలో.... ఎక్సరేలు.. ఇంజెక్షనులు... అన్నీ అయ్యాక చేతిమణికట్టు దగ్గరుండే ఎముక చిట్లిందని అతుక్కునేందుకు టైము పట్టుందని, డాక్టర్ చెప్పాడు. ఈ విషయాలన్నీ - అద్దెలకున్న వాళ్ళ పనిమనిషి - మా పని మనిషికి చెప్తే - అది నాకు చేరవేసింది. దాంతో మరికొన్ని విషయాలు తెలిసేయి! ఊరు నుంచి వచ్చిన బావమరిది చెల్లెలు ద్వారా కొంతడబ్బు కావాలనీ అడిగిస్తే మనోహర్ విసుక్కుని 'నాకే ఆసుపత్రి ఖర్చులున్నాయి. పైగా చేయి విరిగింది గనుక ఆఫీసు కెళ్ళడానికి లేదు. సెలవలో వుంటే ... జీతం రాదు' అని చెప్పాడుట. ఆ బావమరిది అలిగి నీ ఖర్మ నువ్వు అనుభవించంటూ వెళ్ళిపోయాట్ట! ఆ భార్యా ఆసుపత్రికీ, ఇంటికీ - పిల్లల స్కూలుకీ తిరుగుతూ నానా హైరానా పడుతోందని పనిమనిషి వార్త తెలిసింది!

అంటే ఆర్థికంగానూ, చేయి ఆసరాకీ, కూడా కష్టంగా వుందన్నమాట!? ఎవరు మాత్రం ఏం చేయగలరు?

అతుక్కునేందుకు మూడు నెలలు దాటి పోయినా - ఏ లాభంలేక పోయింది అని తెలిసింది పైగా - బ్యాండేజి వేసి ఇంటికి పంపించేరు - అద్దెలు తప్ప - మరో రకమైన ఆధారం తగ్గిపోతోందిట!

ఈ మూడు నెలల్లో - భార్యవైపు బంధువులెవరు వచ్చినట్టు లేరు. నార్తులో వుండే చెల్లెలు కూడా రాలేదు. ఆమే కాదు బావ కూడా రాలేదు. వస్తారని మనోహర్ ఆశించివుండడు. ఎందుకంటే తల్లిని బయటికి గెంటేసేడన్న సంగతి చెల్లెలికీ, బావకి తెలుసు! అలాంటప్పుడు, అన్నమీద ప్రేమ... అభిమానం ఎలా వుంటాయి?

అందుకే - ఇరువైపుల వాళ్ళు వచ్చినట్టు లేరు... వానాకాలం అంటే - పనులన్నిటికీ ఆటంకం! పిల్లల్ని స్కూలుకి పంపాలన్నా బయటికి వెళ్ళాలన్నా కష్టమే!


ఈ మధ్య ఇంట్లోనే వుంటున్న మనోహర్‌కి బోరు కొట్తోందేమో బ్యాండేజీతో బెడ్‌మీద వుండలేక బాల్కనిలో పచార్లు చేస్తున్నాడు. భార్య కూడా పనులతో అలిసిపోయి... చికాకుపడుతూ మనోహర్‌ని విసుక్కుంటు పిల్లల్ని కొట్టొందట. కనిపిస్తూనే వుంది. భార్యకోపం చూసి, అతను చిర్రెత్తిపోతూ వుంటాడు. అలాంటి సమయంలో చేతులు విసురుతున్నాడు. ఒకసారి అలా విసిరినప్పుడు చేతికట్టు కదిలి, మెలిదిరిగిపోయాడట వెంటనే ఆటోలో ఆసుపత్రికి తరలించారు.


కేసు మళ్ళీ మొదటికి వచ్చిందని తెలిసింది! అతుక్కుంటున్న ఎముక మళ్ళీ చెదిరిందట! కోపంతో అతను చేస్తున్న పనులకి చేయి సంగతి అలా వుంచి... కడుపులో తేడావచ్చి... రకరకాల రోగాలు వచ్చే అవకాశం వుందని, డాక్టర్లు బాగా కోపగించారట! ఇక ఇంటికి పంపించకుండా ఆసుపత్రిలో ఒక బెడ్ అతనికి వుంచి వైద్యం చేస్తున్నట్టు... మా పని మనిషి ద్వారా నాకు వార్త అందింది! భార్య పుట్టింటి నుంచి ఆమె అక్క వచ్చి కొంత చెల్లెలికి, ఆసరాగా వుంది!

మనోహర్ ఆఫీసులో లోను తీసుకుని ట్రీట్‌మెం

## మనమీదేనర్రోయ్!

సరసి





టుకు ఇంటి ఖర్చులకీ – వాడుకుంటున్నా – మళ్ళీ అవన్నీ ఎలా తీర్చుకోవాలో తెలియక పిచ్చి వాడిలా తయారు అవుతున్నాడట!

ఏమిటో వాడెలాపోతే నాకు ఎందుకు? ఈ మధ్య నాకు ఇదే వెర్రి ఎక్కువై పోతోంది. తగ్గించుకోవాలి అనుకున్నాను.

మనసు మాట వింటుందా?

తెల్లారిలేస్తే.... బాల్కనీలో పని చేసుకోకా తప్పదు... వాళ్ళ ఇంటివైపు చూడకుండా తప్పదు. కాని ఆవిడ్ని తల్చుకుంటే మాత్రం మనసు చివుక్కుమంటూనే వుంటుంది! పాపం కొడుకుతో అవమానం భరించలేక ఇంట్లోంచి వెళ్ళి ఎక్కడ వుంటుందో? వీడికి తెలిసే వుంటుంది? అనుకున్నాను.

ఆ తల్లికి కూడా కొడుకు సంగతి తెలియకుండా వుంటుందా? ఎవరో ఒకరు చెప్పకుండా వుంటారా? కానీ ఆవిడ రాలేదు! మనసు ఎంత గాయపడిందో ఆ తల్లికి??

ఆ రోజు పొద్దుట్నుంచీ సన్నజల్లు పడుతూనే వుంది. చీదరగా, చికాకుగా, విసుగ్గా వుంది! పేపర్ రాలేదు... పని మనిషీ రాలేదు... కరెంటు పోవడం వల్ల టీవీ. గ్రైండర్ పనిచేయటం లేదు. పోనీ పిల్లల్ని స్కూలు మాన్పిద్దామంటే... వాడు సెవెన్త్‌లో వున్నాడు... యూనిట్ టెస్టులు వుంటాయి. మానేయనన్నాడు. పిల్ల ఫిఫ్త్‌క్లాసు చదువుతోంది. మ్యాథ్స్‌లో పూర్... ఒక్కరోజు కూడా స్కూలు మానదు! మంచి పద్ధతే! కాని వానకి తెలీదు కదా?? సరే ఆటో అబ్బాయి చినుకుపడిందంటే... రాడు... శ్రీవారు... రైన్‌కోటు తగిలించి, హెల్మెట్ పెట్టుకుని... యుద్ధవీరుళ్ళా తయారవుతారు... పిల్లల్ని స్కూల్లో దింపటానికి! ఇక నాకు బాక్సులు సిద్ధం చేసే పని తప్పదు. పని మనిషి రాలేదు, కనుక అంట్ల గిన్నెలు తోముకోవాలి!... ఇవన్నీ ఈతి బాధలు!! అయినా.. బ్యాంకు బాలెన్సు బరువుగా వుండి, జేబులో పర్సు భరోసా ఇస్తున్నంతకాలం – ఏ బాధా ఇబ్బంది అనిపించదు! అది లేకపోతేనే.... మనుష్యులు తలకిందులై పోతారు.. ఆ తలంపు వచ్చేసరికి – చటుక్కున గుర్తు వచ్చారు పక్కింటి మనోహర్ వాళ్ళు! పాపం! పేషంటుగా ఆసుపత్రిలో పడి వున్నాడు... డబ్బు చాలటం లేదు... ఎలా అవస్థ పడుతున్నారో?.. అనుకున్నాను.

మధ్యాహ్నం కొద్దిగ తగ్గిన జల్లు సాయంత్రానికి జోరు అందుకుంది. ఒకటే వర్షం! ఎక్కడి వాళ్ళు అక్కడ వుండి పోతున్నారు. ఇళ్ళల్లో వాళ్ళు – బయటికి వెళ్ళలేక పోతున్నారు.

ఆశ్చర్యం! ఆ పరిస్థితిలో టాక్సీలో మనోహర్, భార్యతో ఇంటికి వచ్చాడు! అద్దెకున్న వాళ్ళల్లో ఒక పెద్దమనిషి జాగ్రత్తగా గొడుగు పట్టి మనోహర్‌ని ఇంట్లోకి తీసుకు వస్తున్నాడు!!

పోనీలే పాపం! ఆయన డబ్బు సర్దుబాటు చేస్తున్నాడేమో అనుకున్నాను. కానీ... కాదు... కాదు..

మనోహర్ బాల్కనీలో నించుని ఆకాశం వైపు చూస్తూ... ఏడుస్తూ గట్టిగా అంటున్న అరుపు వినిపించింది.

''అమ్మా నన్ను క్షమించు అమ్మా! నేను పాపిష్టి కొడుకుని నిన్ను బాధించేను... నాకు తగినశాస్తే జరిగింది. అయినా నువ్వు నన్ను ఆదుకున్నావు. అమ్మా! అమ్మా!'' అంటున్నాడు.

'ఏమిటి? ఏం జరిగింది?' అంతా అయోమయంగా వుంది! సస్పెన్సు భరించలేక పోతున్నాను. అయినా భరించాల్సిందే! ఎవరు చెప్తారు, ఎల్లా చెప్తారు? ఇంత పెద్ద వర్షం? ఆకాశం నుంచి ధారలు ధారలు...

'ఆకాశం చిల్లుపడింది?' అన్నట్టుంది!!

సాయంత్రం తడిసి ముద్దై పిల్లల్ని తీసుకువచ్చిన శ్రీవారితో నా ఆరాటం చెప్పటానికి జంకేను – ఎక్కడ తిట్టారో అని భయం!

ఆ రాత్రి బిగపట్టుకుని ఎలాగో పడుకున్నాను. తెల్లవారే సరికి వర్షం తగ్గి పోయింది. ప్రకృతి అంతా ఏడ్చిఏడ్చి కళ్ళు తుడుచుకున్నట్టు ప్రశాంతంగా వుంది!

మళ్ళీ అందరిపనులు యధావిధిగా జరిగిపోతున్నాయి! పని మనిషి కొంచం లేటుగా వచ్చింది–

విషయం తెల్సింది! మనోహర్ నిన్న వాళ్ళమ్మని తల్చుకుని ఏడ్చిన దెందుకో అర్థమైంది! ఆవిడ మొన్న తన కొడుక్కి డబ్బు పంపే ఏర్పాటు చేసిందిట! నార్త్‌లో కూతురి దగ్గరకి వెళ్ళి – ఆసుపత్రిలో తను కిడ్నీ ఎవరికో డొనేటు చేసిందిట! ఆ ధనవంతుడు రెండు లక్షలు ఇచ్చాడుట! కూతురికి యాభై వేలు ఇచ్చి – కొడుకు అవసరాలకి లక్షన్నర పంపే ఏర్పాటుచేసిందని ఆ డబ్బు – మొన్న అందినదని – చెప్పింది పని మనిషి!

''దేవతమ్మ! కన్నతల్లి ప్రేమ చూడమ్మా తనని పంపించేసినా ఆ కొడుకు తన బాగోగులు చూడక పోయినా – తల్లి పేగుబంధం చూడమ్మా. ఎప్పుడూ డబ్బుకోసమే గొడవ పడేవాడట! బ్యాంకులో ఆమె ఏదో దాచుకుందనీ అదంతా ఇయ్యమని కొట్లాట పెట్టుకుని గెంటేసిన ఆ కొడుకు కోసం తన కిడ్నీ అమ్ముకుని డబ్బు పంపించిందట ఆ తల్లి! ఇన్నాళ్ళు కూతురు దగ్గర కూడా లేదంటమ్మా ఎక్కడో ఆశ్రమంలో వుందంట!!'' అంటు కళ్ళ నీళ్ళు తుడుచుకుంది. ''చూశావా అమ్మా తల్లిని గెంటిన చేయి ఎముకే విరిగింది! ఎంత బాధ పడుతున్నాడో మరి!'' అంది–

విన్నాను – అంతా విన్నాను.

'క్షమయా ధరిత్రి' అన్నారు.

ఆవిడతో ఎప్పుడూ నేను మాట్లాడలేదు!

అయినా ఆ రోజు నాకు దుఃఖం వచ్చింది!

కానీ ఎప్పుడూ చూసే ప్రకృతి – ఆ మాతృమూర్తి చేసిన త్యాగానికి తల్లడిల్లి పోయింది! అందుకే ఆమె పంపిన డబ్బు కొడుక్కి అందగానే – ఆ తల్లికి జోహార్లు అర్పిస్తూ – ఏడ్చింది. నిన్నటి రోజు నింగి నేల ఏకమైన రోజు!

'ఆకాశం చిల్లుపడిన' రోజు అనిపించింది నాకు.

*

రచయిత సెల్ నెం: 9247846581



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### మిడిల్ వెయిట్ బాక్సర్

జెయింట్ వీల్ కింద పడుంది శవం. చాలా ఎత్తునుండి పడటంతో తల చితికింది. ఇతర గాయాలేమీ లేవు. ఒంటిమీద ఒక టీ షర్టు, పాంటు, స్పోర్ట్స్ షూ వున్నాయి. బరువు చూసుకున్నాడేమో, జేబులో ఓ వెయింగ్ మెషీన్ కార్డు కూడా వుంది. ''తేదీ: 28 జులై: బరువు 173 పౌండ్లు. మీరు అదృష్టజాతకులు. చిరకాలం ఆనందంగా జీవిస్తారు''.

''ఇతడు మిడిల్ వెయిట్ బాక్సర్. నిన్నరాత్రే ఓ పోటీలో పాల్గొన్నాడు. అయితే, యిక్కడికెప్పుడు వచ్చాడో, జెయింట్ వీల్ ఎలా ఎక్కాడో తెలియదు'' అన్నాడు ఇనస్పెక్టర్.

''ప్రమాదమని ఎందుకనుకుంటారు? హత్య కూడా కావచ్చుగా?'' అన్నాడు డిటెక్టివ్.

''అవకాశం లేదు. ఇతనికెవ్వరూ శత్రువులు లేరు. ప్రేమ వ్యవహారాలు లేవు. బాక్సింగ్‌లో యిప్పుడిప్పుడే పైకి వస్తున్నాడు. పెద్దగా డబ్బు కూడా లేదు.''.

''నిన్న ఎవరితో పోటీలో పాల్గొన్నాడు?''

''అయిదారుగురు పాల్గొన్నారు. కానీ వీటి సంగతులు మీకు తెలుసుగా. బాక్సింగ్ పోటీలన్నీ ప్రేక్షకులకోసమే. ముందరే మాచ్ ఫిక్సింగ్ జరిగి పోతుంది. ఏ రౌండులో ఎవరు గెలవాలో నిర్వాహకులు ముందే నిర్ణయిస్తారు. ఈ పోటీలు ప్రతిభకు పరీక్షలు కావు. కేవలం ఎంటర్ టెయిన్‌మెంట్ మాత్రమే''.

''ఇతడు మిడిల్ వెయిట్ బాక్సర్ గద''.

''అవును''.

''నిస్సందేహంగా యిది హత్యే. ఎక్కడో చంపి, దుస్తులు మార్చి తీసుకొచ్చి యిక్కడ పడేశారు. హంతకుని కోసం వెదకండి'' అన్నాడు డిటెక్టివ్.

డిటెక్టివ్‌కు తెలిసిన క్లూ ఏమిటి?

సమాధానం: మనిషి బరువును బట్టి బాక్సింగ్‌లో ఫెదర్‌వెయిట్, మిడిల్ వెయిట్, హెవీ వెయిట్ విభాగాలుంటాయి. మిడిల్ వెయిట్ బాక్సర్ బరువు 160 పౌండ్లకు మించకూడదు. వెయింగ్ మెషీన్ కార్డు ప్రకారం అతని బరువు 173 పౌండ్లు. అంటే ఆ దుస్తులు అతనివి కావు.